క్లుప్తంగా

రేషన్ పంపిణీని సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న సివిల్ సప్లైస్ డీటీ నవీన్

గూడూరు రూరల్: లబ్ధిదారులందరికీ సక్రమంగా రేషన్ పంపిణీ చేసేలా డీలర్లు దృష్టి సారించాలని సివిల్ సప్లైస్ డీటీ నవీన్ అన్నారు. గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం డీలర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీలర్లు రేషన్‌తో పాటు ఇతర నిత్యావసర సరుకుల పంపిణీకి సంబంధించి డీడీలు కట్టి సిద్ధంగా ఉండాలని సూచించారు. జూలై 1వ తేదీ నుంచి గతంలో మాదిరిగానే వాహనాల ద్వారా లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు.

టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్



టవర్ ఎక్కిన శ్రీనివాసులు

పాణ్యం: తన భార్య, అత్తపై దాడి చేసిన వారిని శిక్షించి తమకు న్యాయం చేయాలని ఓ వ్యక్తి పాణ్యం బస్టాండ్ వద్దనున్న బీఎస్ఎన్ఎల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. ఎస్‌ఐ అశోక్ వివరాల మేరకు.. పాణ్యంకు చెందిన శ్రీనివాసులు భార్య రమాదేవి, సులోచన తోడికోడళ్లు. ఇద్దరూ తరచూ గొడవపడేవారు. ఈ నెల 22వ తేదీ సులోచన తండ్రి నాగన్న మరికొందరితో కలిసి రమాదేవి ఆమె తల్లి రామాంజనమ్మపై దాడి చేశారు. నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స తీసుకుని సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చారు. ఈ క్రమంలో తమకు న్యాయం చేయాలని రమాదేవి భర్త శ్రీనివాసులు సెల్‌టవర్ ఎక్కాడు. కొందరు టవర్‌పైకి ఎక్కి అతడికి సర్దిచెప్పి కిందకు దింపారు. రామాంజనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు

సి.బెళగల్: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పోలకల్ గ్రామానికి చెందిన రైతు కమ్మరి వెంకటేశ్వర్లు తన పొలంపై బ్యాంక్ రుణం ఇవ్వడం లేదని.. తనకు న్యాయం చేయాలని తహసీల్దార్ అనుపమకు వినతిపత్రం సమర్పించాడు. తనకు ఇంటి స్థలం మంజూరు చేయాలని సి.బెళగల్‌కు చెందిన లింగమయ్య, తన ఇంటి స్థలానికి డూప్లికేట్ పట్టా ఇవ్వాలని కొండాపురానికి చెందిన దానమ్మ, సి.బెళగల్ కొండల్లో ఆక్రమణలను అడ్డుకోవాలని గ్రామస్తులు అర్జీలు అందజేశారు. ఆయా అర్జీలను విచారించి తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వీఆర్వోలను ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్, ఎంఈఓ జ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు గోనేనాయక్, సుమంత్, వైకేపీ ఏపీఎం వెంకటస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, మల్లేశ్వరి ఉన్నారు.

అనుమతి ఉన్న విత్తనాలనే విక్రయించాలి



విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ

కోడుమూరు రూరల్: వ్యవసాయశాఖ అనుమతి ఉన్న విత్తనాలనే రైతులకు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ దుకాణదారులను ఆదేశించారు. సోమవారం కోడుమూరులోని విత్తన, ఎరువుల దుకాణాల్లో ఏఓ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. విత్తనాలకు సంబంధించిన స్టాక్ రికార్డులు, లైసెన్స్‌లను పరిశీలించారు. ప్రతి దుకాణదారుడు అనుమతి ఉన్న కంపెనీల విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని, విత్తన కొనుగోలు సమయంలో రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. అనుమతి లేని విత్తనాలు, నకిలీలు అమ్మితే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం మూడు రకాల పత్తి విత్తనాలను ఏఓ సేకరించి పరీక్షల నిమిత్తం తాడేపల్లిగూడెం ల్యాబ్‌కు పంపించారు.

నేడు రైతుబజారు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని సీ.క్యాంపు రైతుబజారును నేడు బంద్ చేస్తున్నట్లు ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్ తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే రైతుబజారులో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుగా మంగళవారం సెలవు ప్రకటించినట్లు వారు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సూక్ష్మపోషకాలు.. అధిక దిగుబడులు

- పంటల్లో సూక్ష్మపోషకాల పాత్ర కీలకం
- లోపిస్తే దిగుబడులపై ప్రభావం
- భూసార పరీక్షలతో గుర్తింపు
- కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలురెడ్డి సూచనలు



సాలురెడ్డి, ఏడీఏ, కర్నూలు

కర్నూలు(అగ్రికల్చర్): పంటల పెరుగుదలకు ప్రధాన పోషకాలతో పాటు సూక్ష్మపోషకాల అవసరం ఎంతో ఉంది. ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ అందుబాటులో ఉన్నా పంటల్లో సూక్ష్మపోషకాల లోపాలు ఉంటే దిగుబడులు తగ్గుతాయి. వివిధ పంటలకు సూక్ష్మ పోషకాల లోపం ప్రధాన సమస్యగా మారుతుంది. రైతులు ఈ లోపాలను గుర్తించలేక చీడపీడలనే ఉద్దేశంతో అడ్డూఅదుపు లేకుండా పురుగు మందులు వాడుతూ నష్టపోతుంటారు. భూసార పరీక్షల ద్వారానే సూక్ష్మ పోషకాల స్థాయి తెలుస్తుంది. కావున భూసార పరీక్షలు ఎంతో ముఖ్యం. సూక్ష్మపోషకాల లోపం వల్ల పంటల్లో ఏర్పడే లక్షణాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఖరీఫ్ సాగు నేపథ్యంలో కర్నూలు సబ్ డివిజన్ సహాయ సంచాలకులు ఎస్.సాలురెడ్డి సూక్ష్మ పోషకాల లోపాల లక్షణాలను వివరించారు.

సూక్ష్మపోషకాలంటే..?

జింక్, ఇనుము, బోరాను, రాగి, మాంగనీసు, మాలిబ్డినం, క్లోరిన్ వంటి వాటిని సూక్ష్మపోషకాలుగా వ్యవహరిస్తారు. రైతులు ప్రధాన పోషకాలు మాత్రమే వాడటానికి అలవాటు పడ్డారు. సూక్ష్మపోషకాలను వాడటం లేదు. నేలలో ఏ ఒక్క సూక్ష్మపోషక పదార్థం లోపం ఉన్నా.. ప్రధాన పోషక పదార్థాలు సరైన ఫలితాన్ని ఇవ్వవు. అందువల్ల నేలలో సూక్ష్మపోషకాల లోపాలు ఉంటే ఎరువులను వేసుకుని లోపాలు పంటపై రాకుండా నివారించుకోవాల్సిన అవసరం ఉంది.

జింక్ ధాతువు

పత్తిలో జింక్‌లోపం విత్తిన మూడు వారాల తర్వాత కనబడుతుంది. ఆకుల మధ్యభాగంలో పాలిపోయినట్లు కనిపిస్తాయి. తుప్పు పట్టినట్లుగా అనిపించే మచ్చలు ముదురు ఆకులపై నుంచి లేత ఆకులపైకి విస్తరిస్తాయి. ఆకులు పెలుసుగా మారుతాయి. వరి, వేరుశనగ, మొక్కజొన్న, నిమ్మ, అరటి, మామిడి, జామ, టమాటట, మిరప, పెసర, మినుము పంటల్లో జింక్ ధాతువు లోపాలు ఏర్పడతాయి. ప్రస్తుతం ఉన్న పంటలు, పండ్ల తోటల్లోనూ జింక్ లోపం లక్షణాలు కనిపిస్తే లీటరు నీటికి 3 నుంచి 5 గ్రాముల జింక్ సల్ఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. వరి, వేరుశనగ, పత్తి, మొక్కజొన్న వేసే రైతులు ముందుగా ఎకరాకు 20 కిలో జింక్ సల్ఫేట్ భూమిలో వేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. పైరుపై జింక్ లోపం కన్పించగానే లీటరు నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేటు కలిపి 5 రోజుల వ్యవధిలో 2,3 సార్లు పిచికారీ చేయాలి.

ఇనుప ధాతువు

ఆకుల్లో పత్రహరితం తయారు కావడానికి ఇనుము ఆధారం. ఇది పిండి పదార్థం తయారీకి ఉపయోగపడుతుంది. ఆకుల ఈనలు ఆకుపచ్చగా ఉండి మధ్య భాగంలో పసుపుపచ్చగా మారి తర్వాత తెలుపునకు తిరుగుతాయి. వరి, వేరుశనగ పంటల్లో దీని ప్రభావం ఉంటుంది. వాటర్‌షెడ్ ప్రాంతాల్లో ఈ ధాతువు లోపం అరటి, నిమ్మ, మామిడి, దానిమ్మ పంటల్లో కనిపిస్తాయి. బావులు, బోర్లు, ఇతర నీటిపారుదల కింద ఉన్న పంటల్లో ఈ లోపం ఉంటే 5 గ్రాముల ఐరన్ సల్ఫేట్(అన్నభేది) లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పంటలు వేసే భూమిలో ఎకరాకు 15–20 కిలో ఐరన్ సల్ఫేట్ వేసుకుని నివారించవచ్చు.

రాగి ధాతువు

ఆకుల చివర్లు పాలిపోయినట్లు ఉంటాయి. ఆకులు పెలుసుగా ఉండి చీలిపోతాయి. ఈ ధాతువు లోపం, వరి, చెరుకు, వేరుశనగ, శెనగ, దానిమ్మ, మల్లెల్లో కనిపిస్తుంది. లోపం ఉన్నట్లు గుర్తిస్తే 5 గ్రాముల మైలుతుత్తంను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

బోరాన్ లోపం

మొగ్గ చనిపోతుంది లేదా వస్తున్న ఆకులు పాలిపోతాయి. ఆకులు మొద్దుగా మారతాయి. వంకర్లు పెలుసుగా ఉంటాయి. గోధుమ రంగు కొరడా లాగా కూడా ఉండవచ్చు. పండ్లు పగులుతాయి. బెండువారిన పండ్లు తయారవుతాయి. అరటిలో గెల బరువు తగ్గి కాయలు చిన్నగా ఏర్పడి పగుళ్లు వస్తాయి. అరటి, నిమ్మ, టమాట, క్యాబేజీ, బొప్పాయి, జామలో బోరాన్ లోపం కనిపిస్తుంది. మొక్కలు నాటుకునే ముందు 20 గ్రాముల బోరాను వేసుకోవాలి. నాటిన తర్వాత అయితే 2 గ్రాముల బోరిక్ ఆసిడ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

మాలిబ్డినం

ఆకులు లేత ఆకుపచ్చరంగులో ఉండి రంగుల మచ్చలతో లేదా మరణించిన భాగాల్లో కాని కనిపిస్తాయి. ఎక్కువగా క్యాబేజీ, క్యాలిఫ్లవర్‌లో మాలిబ్డినం లోపాలు కనిపిస్తాయి. పంట వేసేముందు 40 గ్రాముల అమ్మోనియం మాలిబ్డినేటు వేయాలి. ప్రస్తుతం ఉన్న ఈ పంటల్లో 30 గ్రాముల అమ్మోనియం మాలిబ్డినేటును 500 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆమ్ల నేలల్లో అయితే సున్నం వేసి పి.హెచ్ పెంచడం ద్వారా మాలిబ్డినం లభ్యతను పెంచవచ్చు.

మాంగనీసు

ఈ లోపం ఏర్పడినప్పుడు ఆకుల ఈనలు ఆకుపచ్చగా ఉండి మధ్యభాగం పసుపుపచ్చగా మారి తర్వాత తెలుపునకు తిరుగుతాయి. ఈ లోపం ప్రధానంగా అరటిలో కనిపిస్తుంది. నివారణకు 5 గ్రాముల మాంగనీసు సల్ఫేట్‌ను లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో 2, 3సార్లు పిచికారీ చేయాలి.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

ఇలాంటి నేలల్లో లోపం ఉండే అవకాశం

- నత్రజని, భాస్వరాన్ని అధిక మోతాదులో వాడటం, అధిక సున్నం కలిగిన చౌడు భూములు, చాలా ఎక్కువగా బంకమన్ను గల నల్లరేగడి భూములు, ముంపు లేక మురుగు భూములు, ఒక చలి కాలంలో సాగు చేసే రబీ పైర్లలో తరచుగా జింక్ లోపం కనిపిస్తుంది.
- అధికంగా సున్నం గల భూములు, అధిక భాస్వరం కలిగిన భూములు, బైకార్బనేటు ఎక్కువగా ఉన్న సేద్యపు నీటి వాడకం వల్ల ఇనుప ధాతువు లోపం ఎక్కువగా కనిపిస్తుంది.
- చౌడు భూములు, ఇసుక, ఇసుక తీర భూముల్లోనూ సాధారణంగా రాగి ధాతువు లోపాలు వచ్చే అవకాశం ఉంది.
- భూసార పరీక్షలతో సూక్ష్మపోషకాల స్థాయిని తెలుసుకుని తదనుగుణంగా చర్యలు తీసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి.

సమస్యల పరిష్కారానికి కృషి

- నగరపంచాయతీ కమిషనర్ దివాకర్‌రెడ్డి

గూడూరు రూరల్: పట్టణంలో నెలకొన్న సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని కమిషనర్ దివాకర్‌రెడ్డి అన్నారు. గూడూరు నగరపంచాయతీ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సోమవారం కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు, అర్జీలను స్వీకరిస్తామన్నారు. వాటిని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపుతామని తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

సుంకేసులకు పెరిగిన ఇన్‌ఫ్లో

గూడూరు రూరల్: సుంకేసుల రిజర్వాయర్‌కు ఎగువ నుంచి వరద నీరు వస్తుండడంతో ఇన్‌ఫ్లో పెరిగినట్లు సోమవారం డ్యాం జేఈ రాజు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌కు 1050 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఒక గేటును తెరిచి దిగువకు 912 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 130 క్యూసెక్కులు వదులుతున్నామని వెల్లడించారు. రిజర్వాయర్ సామర్థ్యం 1.235 టీఎంసీ ఉండగా కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పూర్తి స్థాయిలో నిండుకుందని ఆయన తెలిపారు.

శిలాఫలకం ధ్వంసంపై కేసు నమోదు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామంలో హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి శిలాఫలకాన్ని ఇటీవల దుండగులు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. గ్రామ సర్పంచ్ బత్తుల విజయగౌరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు. హెల్త్ సెంటర్‌కు సంబంధించి ప్రభుత్వానికి రూ.25 వేల నష్టం కలుగజేశారని పేర్కొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

కోడుమూరు రూరల్: డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ దివ్య సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌పై వైద్యాధికారులు శ్రీమంత్‌మాదన్న, భాస్కర్‌తో కలిసి గ్రామ సచివాలయ సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, హెల్త్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు ప్రబలుతున్న దృష్ట్యా అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలకు సరఫరా చేసే మంచినీటిని ప్రతిరోజు క్లోరినేషన్ చేయడంతో పాటు ట్యాంకులను శుభ్రం చేసి పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయాలని సూచించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించాలన్నారు. మందులు అందజేయడంతో పాటు పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



కోడుమూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ దివ్య

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, ఈఓఆర్డీ మంజుల, ఏపీఎం పుష్పావతి, ఈఓ అజయ్‌భాస్కర్, ఎంఈఓ శరభయ్య పాల్గొన్నారు.

డయేరియా నివారణపై చర్యలు తీసుకోవాలి

గూడూరు రూరల్: డయేరియా నివారణపై వైద్య, సచివాలయం, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ విజయసింహారెడ్డి సూచించారు. కె.నాగలాపురంలో సోమవారం తాగునీటి ట్యాంకులు పరిశీలించారు. అనంతరం సచివాలయంలో సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు.



కె.నాగలాపురంలో ట్యాంకు పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

డయేరియా వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామంలోని తాగునీటి ట్యాంకులతో పాటు మినీ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సూచించారు. క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేయాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట ఈఓఆర్డీ మధులత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సన చౌదరి పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ చోరీ



బ్రాహ్మణదొడ్డిలో మోటార్ చోరీ అయిన ప్రదేశం



ధ్వంసమైన స్టార్టర్

సి.బెళగల్: మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త కృష్ణకు చెందిన వ్యవసాయ మోటార్‌ను దుండగులు ఎత్తుకెళ్లారు. ఆదివారం రాత్రి పొలంలో ఉన్న మోటార్‌తో పాటు విద్యుత్ తీగలను చోరీ చేసి స్టార్టర్, పైప్‌లైన్‌ను ధ్వంసం చేశారని బాధితుడు తెలిపాడు. క్యారెట్, ఉల్లి నార సాగు చేస్తున్నానని, పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు రూ.1.5 లక్షల వరకు నష్టం జరిగిందని, తనకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించాడు. గ్రామంలో విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

వైద్యం చేసేందుకు సిద్ధంగా ఉండాలి

- వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం
- బాధితులకు సత్వరం అవసరమైన సేవలు అందించాలి
- వైద్య సిబ్బందితో ప్రభుత్వాసుపతి సూపరింటెండెంట్



సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఎక్కువ కనుక అత్యవసర పరిస్థితుల్లో వైద్యం చేయడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, అతిసార వ్యాధులపై వైద్యులు, సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో అతిసార, మలేరియా, డెంగీ కేసులు వస్తే వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆసుపత్రిలోని ఐడీ వార్డు కోసం 20 పడకల విభాగంలో మగవారికి 10 పడకలు, ఆడవారికి 10 పడకలు వెంటనే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఐడీ వార్డులో అవసరమైన లైట్లు, ఫ్యాన్లు, వైరింగ్‌లను వెంటనే ఏర్పాటు చేయాలని ఎలక్ట్రికల్ సిబ్బందికి ఆదేశించారు. ఆయా వార్డుల్లో అవసరమైన సిబ్బందిని నియమించాలని నర్సింగ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఐడీ వార్డులో అవసరమైన వైద్య సిబ్బంది, వైద్యులు, హౌస్‌సర్జన్లు, పీజీ విద్యార్థులను అందుబాటులో ఉంచాలన్నారు. న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో అన్ని వైద్యపరీక్షలు నిర్వహించాలని, త్వరగా రిపోర్టులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్, ఆర్ఎంఓలను ఆదేశించారు. సీజనల్ వ్యాధులను అధిగమించే వరకు మెయిన్ డ్రగ్ స్టోర్‌లో మందులు అందుబాటులో ఉన్నాయో లేదో తనిఖీ చేయాలని ఫార్మాసిస్టు గ్రేడ్ వన్‌ను ఆదేశించారు. ఏవైనా మందులు అందుబాటులో లేకపోతే తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే స్థానికంగా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులను వెంటనే ఐడీ వార్డుకు అందజేయాలని చెప్పారు. డెంగీ కేసుల కోసం ప్లేట్‌లెట్లు, పీఆర్‌పీలను అందుబాటులో ఉంచుకోవాలని బ్లడ్ బ్యాంక్ సిబ్బందికి ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సమయంలో అందరూ వైద్యులు, సహాయక సిబ్బంది రోగుల పట్ల అత్యంత శ్రద్ధ వహించాలని, కేసులను సమీక్షించాలని తెలిపారు. సమావేశంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. లక్ష్మీబాయి, ఐడీ వార్డు ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ డాక్టర్ బ్లెస్సీ మనోహర్ పాల్గొన్నారు.

రోగులకు మందులు అందుబాటులో ఉంచాలి

సుదూర ప్రాంతాల నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన మందులను ఫార్మాసిస్టులు అందుబాటులో ఉంచుకోవాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులోని కాన్ఫరెన్స్ హాలులో ఫార్మసి మాడ్యుల్ ఈ- హాస్పిటల్ గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో ఫార్మసి మాడ్యుల్, ఈ–హాస్పిటల్ అమలు, అప్‌లోడింగ్ ప్రాసెస్‌పై మాక్ డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. రోగులకు సంబంధించిన మందులను ఆన్‌లైన్‌లోనే ఇండెంట్ చేయాలని, దానికి సంబంధించిన వివరాలను ఏ రోజుకు ఆ రోజు ఫార్మాసిస్టులు ఎంట్రీ చేయాలని, దీనిపై ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసుపత్రిలో రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో పేపర్‌లెస్ (ఆన్‌లైన్) పద్ధతిలో వివరాల నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఫార్మసి స్టోర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శారద, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, ఫార్మసిస్ట్ నరసింహులు, ఎన్‌ఐసీ కో ఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

కర్నూలు(హాస్పిటల్): పెద్దాసుపత్రిలో పెద్ద డాక్టర్లుంటారని నమ్మి సుదూర ప్రాంతాల నుంచి రోగులు ఇక్కడికి వస్తారని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి నిర్ణీత సమయంలో ఓపీలో ఉండాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. సోమవారం ఆయన ఆసుపత్రిలోని పలు ఓపీ విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యం, తదితర విషయాలను వైద్యులు, సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. ఆర్థోపెడిక్ ఓపీ విభాగం సందర్శించిన అనంతరం రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. నడవలేని వారికి ఆర్థో ఓపీ విభాగంలో అక్కడే మందులు ఇచ్చే విధంగా చూడాలని సంబంధిత వైద్యులకు, ఫార్మసిస్టులకు, నర్సింగ్ సిబ్బందికి ఆదేశించారు. ఆయన వెంట సీఎస్ఆర్ ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, ఆర్థోపెడిక్ హెచ్ఓడీ డాక్టర్ శ్రీనివాసులు, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్ తదితరులు ఉన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



నేను బడికి పోతా అవగాహన ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

పాణ్యం: విద్యతోనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని.. బడిఈడు పిల్లలను తప్పనిసరిగా బడికి పంపాలని ఎంఈఓ–2 సుబ్రమణ్యం అన్నారు. సోమవారం పాణ్యంలో 'నేను బడికిపోతా' కార్యక్రమం నిర్వహించారు. ప్రతి విద్యార్థి తప్పకుండా బడిలోనే ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ముఖ్యంగా బడిమానేసిన పిల్లలను గుర్తించి మళ్లీ స్కూల్‌కు వచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ బడుల్లో విద్యా బోధన, అందుతున్న సౌకర్యాలను తెలియజేయాలన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల నుంచి బస్టాండ్, అక్కడి నుంచి పాణ్యం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం మేరీ సులోచన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

పాణ్యం: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరగనుంది. పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొననున్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

సి.బెళగల్: గ్రామాల్లో డయేరియా ప్రబలకుండా మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శకుంతల అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీ సందీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్, వైద్యాధికారులతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తాగునీటి సరఫరా, నీటి వనరుల సంరక్షణ, పరిశుభ్రత అంశాలను వివరించారు. కలుషిత నీటితో వ్యాపించే రోగాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా మురుగునీటితో వ్యాప్తి చెందే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సి.బెళగల్ పీహెచ్‌సీ సీహెచ్ఓ ఉమామహేశ్వరి తెలియజేశారు. తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేయించాలని, మురుగునీటి కాలువలను శుభ్రం చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలని ఎంపీడీఓ ఆదేశించారు. కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్ ప్రసాదరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు మద్దిలేటి, మంగమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ శకుంతల

చిరుధాన్యాల సాగుపై అవగాహన



రైతులకు కొర్ర విత్తనాలను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

ఓర్వకల్లు: చిరుధాన్యాల సాగుపై నంద్యాలకు చెందిన ప్రాంతీయ పరిశోధన స్థానం వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సోమవారం ఓర్వకల్లు రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సస్యరక్షణ శాస్త్రవేత్త నరసింహులు చిరుధాన్యాల్లో వివిధ వంగడాల కాలపరిమితి, అంతర పంటల సరళి, అనువైన వంగడాల గురించి వివరించారు. జొన్న, పొగాకులోని వంగడాల గురించి పుల్లిబాయి తెలియజేశారు. జొన్న, కొర్ర పంటల్లో వచ్చే పలు రకాల పురుగుల నివారణపై శాస్త్రవేత్త వెంకటరమణమ్మ అవగాహన కల్పించారు. అనంతరం ఎస్సీ సబ్ ప్లాన్ కింద కొర్రలోని వివిధ వంగడాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోత్స్న కిరణ్మయి, ఏఓ సుధాకర్, వీఏఏ సతీష్ పాల్గొన్నారు.